సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు చుట్టుపక్కల ప్రాంతంలో దాదాపు 25 ఏళ్ల క్రితం 30కి పైగా లేఅవుట్లు వేశారు. వీటిలో వేలాది మంది ప్లాట్లను కొన్నారు. అయితే, గత పదేళ్లుగా అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటిని కాలువలు, తూముల ద్వారా కిందికి వదలకపోవడంతో చెరువులో నీటి మట్టం పెరిగింది. ఫలితంగా వేలాది ప్లాట్లు చెరువులో మునిగిపోయాయి. కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలు ఇప్పుడు చేతికి రాకుండా పోవటంతో వాటిని కొన్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా తమ సమస్యపై ప్రభుత్వానికి విన్నవించే ప్రయత్నాలు చేసినా ఫలితం లభించలేదని చెబుతున్నారు. సదరు చెరువును జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తించినందున నీటిని కిందికి వదిలేది లేదని అధికారులు అంటున్నారని పేర్కొంటున్నారు. వాస్తవానికి రెవెన్యూ రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం 97 ఎకరాలే అయినప్పటికీ.. నీటి మట్టం పెరిగిపోవటంతో మినీ రిజర్వాయర్‌గా తయారైంది. నిరంతరం మియాపూర్, బాచుపల్లి తదితర ఎగువన ఉన్న కాలనీల నుంచి పెద్ద ఎత్తున మురుగునీరు వచ్చిచేరడంతో నిండువేసవిలో సైతం చెరువు నిండుకుండను తలపిస్తోంది. పెద్ద చెరువు కింద మొత్తం 14 గొలుసుకట్టు చెరువులు, కుంటలు ఉన్నాయి. పెద్ద చెరువు నీటిని ఏటా దిగువకు వదలకపోవడంతో ఈ చెరువులు, కుంటలు క్రమంగా కబ్జాలకు గురై కనుమరుగవుతున్నాయి. అయినప్పటికీ, నీటి విడుదల జరగటం లేదు. పెద్ద చెరువులో చేపలు పెంచే వారు సైతం దిగువకు నీరు వదలకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కాగా, పెద్ద చెరువు నీటి ముంపు కారణంగా ఇళ్ల స్థలాలతో పాటు వ్యవసాయ భూములు కూడా ఏళ్ల తరబడి నీట మునిగిపోతున్నాయి. దీంతో ఆయా భూముల రైతులు సాగును పక్కనపెట్టారు. విచిత్రమేమిటంటే గతంలో హుడా, హెచ్ఎండీఏ, పంచాయతీ అనుమతులతో వేసిన లేఅవుట్లు సైతం నీట మునిగాయి. సర్వేనెంబర్లు 196, 197, 198, 146, 149, 176, 177, 323, 324, 209, 211, 174, 199, 200, 202, 203, 205 లలోని దర్శన్‌నగర్, పాంచజన్య, వెదిరి, పద్మావతినగర్, వాణినగర్, ఆర్‌కే 1, ఆర్‌కే 2, ఆర్‌కే 3 తదితర 30 కాలనీలలోని ప్లాట్లు పెద్ద చెరువునీటిలో మునిగిపోయాయి. సుమారు ఐదువేల మంది ప్లాట్లు కోల్పోయారు. పదుల సంఖ్యలో రైతుల భూములు జలమయం అయ్యాయి. పాంచజన్య కాలనీలో ఓ ఇన్‌కంటాక్స్ అధికారి పదేళ్ల క్రితం రెండంస్తుల భవనం నిర్మించిన తరువాత చెరువు నీరు పెరగడంతో దానిని అసంపూర్తిగా వదిలేశారు. పదేళ్లుగా చెరువు నీటిలోనే ఉన్న ఆ అసంపూర్తి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.



పాంచజన్య లేఅవుట్ జలమయం అవడంతో అసంపూర్తిగా వదిలేసిన రెండంతస్తుల భవనం



జేఏసీని ఏర్పాటు చేస్తున్న ముంపు బాధితులు(ఫైల్)

### అభివృద్ధి శూన్యం

అమీన్‌పూర్ పెద్ద చెరువును జీవవైవిధ్య చెరువుగా ప్రభుత్వం గుర్తించినా గతం నుంచీ ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టలేదు. చెరువులోకి నిరంతరం డ్రైనేజీ, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఈ మురుగునీరు వల్ల.. జీవవైవిధ్యం మాట అటుంచి.. చెరువు పరిసరాలు కంపుకొడుతూ సమీపప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చెరువునీటిని శుద్ధి చేసేందుకు ఎస్‌టీపీ ప్లాంటు ఏర్పాటు చేస్తామని హెచ్ఎండీఏ అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఇకనైనా చెరువు నీటిని దిగువకు వదిలి వాస్తవ చెరువు విస్తీర్ణాన్ని పరిరక్షిస్తూ, కలుషితం కాకుండా చూడాలని చెరువు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు డిమాండ్ చేస్తున్నారు.

# కిడ్నీలపై నిర్లక్ష్యం తగదు

- మధుమేహం, రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి
- తగిన జాగ్రత్తలతో మూత్రపిండాల సమస్యలు దూరం
- నేడు వరల్డ్ కిడ్నీ డే



మెదక్ కల్చరల్, మార్చి 13 : ఇటీవల మూత్రపిండాలు(కిడ్నీ) సంబంధిత వ్యాధులతో బాధపడే వారు ఎక్కువవుతున్నారని ఆరోగ్య సంస్థలు చెబుతున్నాయి. మానవ శరీరరంలో కిడ్నీలు కీలకం. ఇవి రక్తంలో కలుస్తున్న మలినాలను వడపోసి శరీరం నుంచి తొలగిస్తాయి. కిడ్నీలు విరామం లేకుండా పనిచేస్తూ రక్తాన్ని శుభ్రంగా ఉంచుతాయి. ఒక రోజులో మానవుని మూత్రపిండాలు దాదాపు 200 లీటర్ల రక్తాన్నిశుద్ధి చేస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. రక్తపోటును నియంత్రించడంలోనూ ముఖ్య పాత్ర పోషిస్తాయి. అయితే కొన్నిసార్లు మూత్రపిండాల సమస్య ఉన్నట్టు గుర్తించలేకపోవచ్చు. మూత్రపిండాలు పనిచేయడం మానేస్తే రక్తం, శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి ఈ పరిస్థితిని అజోటేమియా అంటారు. కిడ్నీల సంరక్షణ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం అవసరం అంటున్నారు వైద్యులు. మెదక్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో సంవత్సర కాలం నుంచి ఇప్పటివరకు 72 మంది కిడ్నీ రోగులకు 9226 సార్లు డయాలాసిస్ చేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

### సమస్యలుంటే గుర్తించడం ఇలా

రక్తం యూరియా స్థాయి పెరిగినప్పుడు వాంతులు, డయేరియాకు దారితీస్తాయి. దీనిని గమనించాలి. వికారంగా ఉండడం, బరువు తగ్గడం, రాత్రి సమయాల్లో మూత్రం అధికంగా రావడం, మూత్రంలో నురగలు రావడం, మూత్రం రంగుమారి కనిపించడం, రక్తం వస్తుండడం వంటివి గమనిస్తే వైద్యులను సంప్రదించాలి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మధుమేహం, రక్తపోటు ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. వారిలో మూత్రపిండాల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ. బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి. ఎక్కువ ప్రోటీన్ కలిగిన మాంసాహారాన్ని మితంగా తీసుకోవాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. నీరు ఎక్కువగా తాగాలి. యాభై ఏళ్లు పైబడిన వారు, ఊబకాయం ఉన్నవారు క్రమం తప్పకుండా కిడ్నీ సంబంధిత పరీక్షలు చేయించుకోవడం మంచిది.

### ఎక్కువగా నీరు తాగాలి

కిడ్నీ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఎక్కువగా నీరు తాగాలి. ముఖ్యంగా నొప్పి నివారణ మందులు అవసరమైతే తప్ప వాడకూడదు. ఎక్కువ ప్రోటీన్లు కలిగిన మాంసాహారాన్ని తగ్గించాలి. అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. నిత్యం బీపీ, షుగర్ చెక్‌చేసుకోవాలి మూత్రం మంటగా ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించాలి. మెదక్ జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అవసరమున్న వారు వినియోగించుకోవాలి.

**- డాక్టర్ చంద్రశేఖర్, మెదక్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్**

## తుమ్మచెట్లు, తుంగలు..

# మురికి కూపం

## డ్రైనేజీ నీటి చేరికతో కలుషితమైన చేర్యాల కుడిచెరువు



కుడిచెరువులో ఏపుగా పెరిగిన తుంగ, పిచ్చిమొక్కలు

చేర్యాల, మార్చి 13 : చారిత్రక నేపథ్యం కలిగిన చేర్యాల పట్టణంలోని కు(గు)డి చెరువు కంపు కొడుతుంది. భూగర్భ జలాల పెంపుతో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఆదరువుగా మారిన ఈ చెరువు అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో గబ్బుమయంగా మారింది. డ్రైనేజీ ద్వారా చెరువులోకి మురుగునీటిని మళ్లిస్తుండటంతో పాటు తుమ్మచెట్లు, తుంగలు, ముళ్ల కంపలు, వ్యర్థాలు పేరుకుపోయి చెరువులో నీరు కలుషితమవుతోంది.

చిన్న నీటిపారుదలశాఖ పరిధిలో ఉన్న చేర్యాల కుడి చెరువుకు సర్వే నెం.202లో 60.21ఎకరాల శిఖం భూములు ఉన్నాయి. శిఖంను ఆనుకుని సుమారు 39 ఎకరాల పట్టాభూమి ఉంది. ఆయా భూముల్లో పలువురు రైతులు సాగు చేసుకుంటున్నారు. చెరువు ప్రాంగణంలో మహమ్మాయి, మార్కండేయ ఆలయాలు ఉన్నాయి. ఏటా ఆలయాల ప్రాంగణాల్లో మహిళలు బతుకమ్మ ఆడి ఇదే చెరువులో నిమజ్జనం చేస్తారు. అంతేకాకుండా నవరాత్రి ఉత్సవాల సమయంలో వినాయక, దేవీ, ఇతర దేవతామూర్తులను ఇదే చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆయా సమయాలలో చెరువు ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్న క్రమంలో కొన్నాళ్ల క్రితం సీసీ ఫ్లోరింగ్ చేపట్టి బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

### సుందరీకరణకు నోచుకోలేక..

కుడిచెరువును సుందరీకరించాల్సి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. చెరువులో తుమ్మచెట్లు భారీగా పెరిగాయి. చెత్తాచెదారం, ముళ్లకంపలు పేరుకుపోయాయి. వరదనీటికి తోడు డ్రైనేజీ నీరు చేరుతుండటంతో చెరువు మురికికూపంగా మారుతోంది. పట్టణంలోని పెద్దచెరువు గోదావరి జలాలతో నింపుతుండటం, కలుషిత పరిస్థితులు లేకపోవడంతో నీరు తేటతెల్లగా ఉండి ఆహ్లాదాన్నందిస్తుండగా, కుడిచెరువు మాత్రం రంగు మారిపోతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



తుమ్మచెట్లపై పక్షులు

### వందలాది పక్షులకు నిలయం


చెరువులో భారీగా తుమ్మచెట్లు పెరగడంతో వేలాలాది పక్షులు ఆవాసం ఏర్పరుచుకున్నాయి. ఏచెట్టును చూసినా వందలాది పక్షులు కనువిందు చేస్తున్నాయి. తెల్లవారుజామున పక్షులు చేస్తున్న సందడిని చూసేందుకు వెళుతుండగా, కంపువాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

### డ్రైనేజీలతోనైనా ఊరట కలిగినా?

జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై పడిన వర్షపు నీటిని మళ్లించేందుకు ప్రస్తుతం కాలువ పనులు చేపడుతున్నారు. ఈ పనుల కోసం గతంలో డ్రైనేజీ కాలువలను తొలగించగా, కొత్తగా కడుతున్న కాలువలోకి అనుసంధానం చేస్తారా.. లేదా మునిసిపల్ ఆధ్వర్యంలో మరో డ్రైనేజీ కాలువ నిర్మిస్తారా అన్న విషయమై సందిగ్ధత నెలకొన్నది. ఒకవేళ వర్షపునీటి మళ్లింపునకు మాత్రమే డ్రైన్‌కాలువను వినియోగిస్తే కుడి చెరువులోకి మురుగు నీరు చేరే పరిస్థితి తలెత్తదు. దీంతో కాలుష్యకోరల నుంచి బయటపడుతుంది, లేదంటే అంతే సంగతి. అధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తు వీడి కుడిచెరువులోని తుంగ, తుమ్మలు, వ్యర్థాలను తొలగించి మురుగు నీటి మళ్లింపును నిలిపివేయడంతో పాటు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువు కట్ట



చెరువులో భారీగా ఉన్న తుమ్మచెట్లు

## బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వావిలాల యువకులు

జిన్నారం,మార్చి 13: జిన్నారం మండలం వావిలాలకు చెందిన యువకులు బుధవారం జిన్నారంలోని బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకుడు ప్రతాప్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారిలో శివశంకర్, శంకర్ యాదవ్, విక్రమ్, విష్ణువర్ధన్‌చారి, వినయ్‌యాదవ్, సంపత్ గౌడ్, ఓంకార్‌చారి ఉన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నాయకులు కోరారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 13: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. 19,439 మందికి 18,514 మంది హాజరుకాగా, 925 మంది గైర్హాజరయ్యారు. 95.24 హాజరు శాతం నమోదైంది. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్, శ్రీతేజ, రాయల్, షాహీన్ జూనియర్ కళాశాలలో కేంద్రాలను జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ బోర్డు సభ్యులు తనిఖీ చేశారు.

# కార్పొరేషన్లతో పేదరిక నిర్మూలన

- కాంగ్రెస్, కులసంఘాల నేతలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు 16కులాల కార్పొరేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కాంగ్రెస్, కులసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పలు పట్టణాల్లో క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఆయా వర్గాల ప్రజల అభ్యున్నతికి కార్పొరేషన్లు చేయూతనిస్తాయని సంఘం నాయకులు పేర్కొన్నారు.**

సంగారెడ్డి అర్బన్, మార్చి 13: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నందున సంగారెడ్డిలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత



సంగారెడ్డిలో ఆర్యవైశ్యుల సంబురాలు

కృష్ణ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి ప్రకాశ్, సభ్యులు భాస్కర్, బుచ్చిలింగం, భాస్కర్, మదన్‌మోహన్, లక్ష్మణ్, శ్రీనివాస్, దేవేందర్, సంతోశ్, శ్రీనివాస్, చంద్రాశ్రీధర్, కృష్ణమూర్తి, ఈశ్వర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **పటాన్‌చెరు:** చిట్కుల్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటుతో ముదిరాజ్‌లకు ఆర్థిక, సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదయ్య, రాములు, వెంకటేష్, మురళి, కృష్ణ, ప్రభు, గోపాల్, అశోక్, శ్రీను, వెంకటేష్, రాజ్‌కుమార్, అంతజయ్య



జిన్నారంలో..



పటాన్‌చెరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నీలం మధు

పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** లింగాయత్ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు లింగాయత్ సమాజ్ సభ్యులతో మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ బుధవారం మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖేడ్ బసవేశ్వర చౌక్‌లో సాగర్ షెట్కార్ ఆధ్వర్యంలో లింగాయత్‌లు సంబురాలు జరుపుకున్నారు.

● **జిన్నారం:** ముదిరాజ్ సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జిన్నారం మండల మత్స్య శాఖ భవనంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, మహేష్, నర్సింహ, శ్రీనివాస్, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## 21న తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

తూప్రాన్, మార్చి 13: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు తేదీ ఖరారు చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. చైర్మన్ ఎన్నిక ఈ నెల 21 ఉదయం 11 గంటలకు నిర్వహించాలని ఉత్తర్వుల్లో సూచించారు. ఎన్నికల నిర్వహణకు ఈ నెల 18లోగా గెజిటెడ్ అధికారిని నియమించాలని ఆదేశాల్లో సూచించారు. కాగా, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ గత నెల 12న మెజారిటీ కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. దీంతో, ఈ నెల 6న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా.. అవిశ్వాసం తీర్మానం నెగ్గడంతో చైర్మన్ పదవిని కోల్పోయారు. ఈమేరకు కొత్త చైర్మన్ ఎన్నిక కోసం ఆదేశాలు జారీ అయ్యాయి. చైర్మన్ ఎన్నిక కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**మరోసారి క్యాంపు..**

మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు తేదీ ఖరారు కావడంతో కౌన్సిలర్లు మరోసారి క్యాంపునకు సిద్ధమవుతున్నారు. అవిశ్వాస తీర్మాన సమావేశానికి ముందు రెండు సార్లు క్యాంపునకు వెళ్లిన విషయం తెలిసిందే. నేడో.. రేపో.. ప్రస్తుత వైస్ చైర్మన్, 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక బీజేపీ కౌన్సిలర్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో క్యాంపునకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. చైర్మన్ పదవిని మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, 4వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల జ్యోతి ఆశిస్తున్నట్లు సమాచారం.

## బడంపేటలో నేటి నుంచి రాచన్నస్వామి జాతర



బడంపేట గ్రామంలోని రాచన్నస్వామి ఆలయం

కోహీర్, మార్చి 13: కోహీర్ మండలం బడంపేటలో వెలసిన రాచన్నస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి మూడు రోజులు జరగనున్నాయి. గురువారం తెల్లవారుజాము 4 గంటల నుంచి స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గంగ పూజ, గోపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, అంకురారార్పణ, నాంది సమారాధన అఖండ దీప ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే, తంగడపల్లి శివయోగి శివాచార్య మహాస్వామి ధ్వజారోహణం, శిఖర పూజ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 16న మధ్యాహ్నం 2.25 గంటలకు భద్రకాళీ సమేత శ్రీరాచన్నస్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అనంతరం దేవగురువు మఠం రాచయ్య స్వామికి అశ్వ వాహనోత్సవం, రథోత్సవం, అగ్నిగుండం ముగింపుతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వరకు ఆర్టీసీ బస్సులు నడుస్తాయని అధికారులు తెలిపారు.

## రికార్డుల్లో లేనోళ్లకూ 'భూసేకరణ' చెల్లింపులు

తూప్రాన్, మార్చి 13: తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామంలో పరిశ్రమల స్థాపనకు చేపట్టిన భూసేకరణలో అవకతవకలు జరిగినట్లు బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కొండ సిద్ధిరాములుయాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహ్మారెడ్డి ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బుధవారం తూప్రాన్ తహసీల్దార్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఘనపూర్ శివారులో జరిగిన భూసేకరణలో రికార్డులో లేకున్నా కొందరికి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేసి, పరిహారం చెక్కులు అందజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అవకతవకలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, సర్వేలు నిర్వహించి, పట్టా సర్టిఫికెట్లు పరిశీలన చేయాలని కోరారు. కాస్తులో ఉండి వ్యవసాయం చేసిన రైతులకు న్యాయం చేయాలన్నారు.

## శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలి

కోహీర్, మార్చి 15: శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని కోహీర్ ఎస్ఐ కృష్ణయ్య సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన కోహీర్‌లోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన పీస్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రజలందరూ సమన్వయంగా ఉండి తమ పండుగలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవచ్చన్నారు. పీస్ కమిటీలో మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఇద్దరు నుంచి ముగ్గురిని ఎంపిక చేసి పీస్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచులు అంజయ్య, రాచయ్య, మాజీ ఎంపీటీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

శివ్వంపేట, మార్చి 13: చింతపండును ఏరుకోవడానికి వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన బుధవారం గూడురులో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గూడురుకు చెందిన సరోజన(70) గ్రామ శివారులోని చింతచెట్టు కింద రాలిన చింత పండును ఏరుకోవడానికి వెళ్లింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు.

## జిల్లా ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నిషియన్ డే



ల్యాబ్ టెక్నీషియన్లతో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త చంద్రశేఖర్

మెదక్ కల్చరల్, మార్చి 13: మెదక్ జిల్లా ఆస్పత్రిలో బుధవారం ల్యాబ్ టెక్నిషియన్ డేను జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త, సాత్వి చారిటి సంస్థ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాత్వి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్ టెక్నిషియన్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు, శివదయాళ్, వైద్యులు కిరణ్ కుమార్‌రెడ్డి, షర్మిల, పాథోలోజిస్ట్ ప్రియదర్శిని, టి హబ్ మేనేజర్ ప్రజ్ఞ పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

నారాయణఖేడ్, మార్చి 13: ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత ఖేడ్ ఆర్టీసీ అధికారులకు సూచించారు. బుధవారం ఆమె ఖేడ్ ఆర్టీసీ డిపోను తనిఖీ నిర్వహించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇటీవల వివిధ జాతరలకు నడిపిన బస్సులు, వచ్చిన ఆదాయం, మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచితంగా ప్రయాణించిన మహిళలు తదితర విషయాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది సమిష్టి కృషి వల్లే జాతరలకు బస్సులను నడిపామన్నారు. ఈ సమావేశంలో డీఎం మల్లేశయ్య, ఏఆర్ఎం పీప కనకరాజు, అకౌంటెంట్ చందుపల్ల, ఆర్టీసీ సీఐ నర్సింహులు, సూపరింటెంట్ ప్రవీణ్, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్చారం, మార్చి 13: మండల పరిధిలోని కిష్టాపూర్ శివారులోని మంజీరా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం స్పెషల్ పార్టీ పోలీసులు పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు కిష్టాపూర్ గ్రామం బయట మంజీరా నది నుంచి ఇసుకను తీసుకువస్తుండగా పట్టుకుని కొల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### ఇసుక రవాణాను అడ్డుకోండి

కొల్చారం, మార్చి 13: కొల్చారం మండలం తుక్కాపూర్ శివారులోని మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని తుక్కాపూర్ గ్రామస్థులు బుధవారం కొల్చారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి రోజు రాత్రిపూట మంజీరా నది నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భజలాలు తగ్గిపోయి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఖేడ్‌కు రూ.6.15 లక్షల ఆదాయం

నారాయణఖేడ్, మార్చి 13: ఖేడ్ మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం తైబజార్, మేకల బజార్, ఎడ్లబజార్, పెద్దమాంసం, చిన్నమాంసం విక్రయాలకు సంబంధించి వేలం పాటను నిర్వహించారు. ఎడ్లబజార్‌ను రూ.3.58 లక్షలు, పెద్ద మాంసం విక్రయాలను రూ.1.85 లక్షలు, చిన్నమాంసం విక్రయాలను రూ.72 వేలకు ఆశావహులు దక్కించుకున్నట్లు కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. తైబజార్, మేకల బజార్ మార్కెట్‌లకు సరైన వేలం ధర రానందున వాయిదా వేసి, ఈ నెల 15న మళ్లీ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిపాజిట్లను ఈ నెల 14న చెల్లించాలని సూచించారు.

### పోలీసుల కవాతు

హవేళిఘణపూర్, మార్చి 13: మండలంలోని తొగిట, హవేళిఘణపూర్, భూర్గుపల్లి గ్రామాల్లో బుధవారం పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో శాంతిభద్రతల రక్షణ కోసం ప్రత్యేక బలగాలతో పోలీసు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### ధరణి సమస్యలు పరిష్కరించండి

సంగారెడ్డి రూరల్, మార్చి 13: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ కోరారు.



## 2008-డీఎస్సీ అభ్యర్థులకు ఊరట

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మంది

సంగారెడ్డి అర్బన్, మార్చి 13 : ఎట్టకేలకు 2008-డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణకు ఫలితం లభించింది. వివిధ కారణాలతో 2008 డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ నిలిచింది. అభ్యర్థులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా 2008 డీఎస్సీ అభ్యర్థులకు మినిమమ్ టైం స్కేలుతో నియామకాలు చేపట్టాలని మంగళవారం రాత్రి రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. దీంతో రాత పరీక్ష ద్వారా ఎంపికై నియామకాల కోసం వేచి చూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మంది డీఎస్సీ రాత పరీక్షలో ఎంపికయ్యారు. 2008 డీఎస్సీ రాత పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల్లో ఎంత మంది విధుల్లో చేరేందుకు సానుకూలంగా ఉన్నారో వివరాలు సేకరించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది.

బొంతపల్లి వీరభద్ర ఆలయ

## కమిటీ చైర్మన్‌గా ప్రతాపరెడ్డి!

గుమ్మడిదల, మార్చి 13: గుమ్మడిదల మండలం బొంతపల్లి-వీరన్న గూడెం వీరభద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా అన్నారం గ్రామానికి చెందిన మద్ది ప్రతాపరెడ్డి పేరు ఖరారైనట్లు సమాచారం. మండలంలోని మెజార్టీ కాంగ్రెస్ నాయకుల అభిప్రాయ సేకరణ చేసిన పార్టీ పెద్దలు ప్రతాపరెడ్డిని నియమించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు నివేదిక అందజేసినట్లు సమాచారం. త్వరలోనే నూతన పాలకవర్గ చైర్మన్, డైరెక్టర్‌లను ప్రకటించే అవకాశం ఉంది.

**ధర్మకర్తల ఎంపికకు నోటిఫికేషన్**

వీరభద్ర స్వామి ఆలయ ధర్మకర్తల ఎంపికకు దేవాలయ శాఖ నుంచి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆలయ ఈవో శశిధర్‌గుప్తా బుధవారం తెలిపారు. ఆసక్తిగల వారు జిల్లాలోని దేవాలయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి సహకారం



వడక్‌పల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 13: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వడక్‌పల్లిలో సీతారామచంద్ర ఆలయం, హనుమాన్ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో ఆలయాల నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహకారం ఉంటుందన్నారు. అనంతరం జానకంపేటలో మల్లిఖార్జునస్వామి జాతరలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయనవెంట వడక్‌పల్లి రాంరెడ్డి, జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు లలితమల్లేష్, పాండుయాదవ్, రాజు తదితరులు ఉన్నారు.

## 'గీతం'లో చర్చాగోష్ఠి

పటాన్‌చెరు రూరల్, మార్చి 13: గీతం యూనివర్సిటీలో బుధవారం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని జీఐఎలక్ట్రా, ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) విద్యార్థి విభాగం సంయుక్తంగా భారత సాంకేతిక దశాబ్దం అంశంపై ఒక రోజు చర్చాగోష్ఠి నిర్వహించారు. సినాప్సిస్ సీనియర్ డైరెక్టర్, సెట్ లీడర్ నరేంద్ర సెమీకండక్టర్, ఎకోసిస్టమ్, సాఫ్ట్‌వేర్, చిప్స్ అంశాలపై ప్రసంగించారు.సెమీకండక్టర్ పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, 2030 నాటికి మార్కెట్ విలువ 3.1 ట్రిలియన్ డాలర్లకు పెరగనుందని చెప్పారు. పరిశ్రమకు అవసరమైన ప్రతిభ గల విద్యార్థులను ఉత్పత్తి చేయడంలో విద్యా సంస్థల ప్రాముఖ్యతను ఆయన ఎత్తిచూపారు. వర్తమాన ఇంజనీర్లు ఈసీఈ, ట్రిబుల్-ఈ, మెకానికల్ వంటి కోర్ ఇంజనీరింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, ఈఈసీఈ విభాగాధిపతి టి.మాధవి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

- ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, మార్చి 13: పార్లమెంట్ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని నర్సాపూర్ ఆర్డీవో, అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, సీఐలు, ఇతర అధికారులతో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. షెడ్యూల్ వచ్చే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవీఎంలను నర్సాపూర్‌లోనే భద్రపరిచి, ఇక్కడే కౌంటింగ్ ఉండనున్నందున అధికారులు జాగ్రతగా వ్యవహరించాలన్నారు. ఎక్కడ కూడా చిన్న పొరపాటు రాకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



నర్సాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

**నారాయణఖేడ్‌లో..**

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్డీవో కార్యాలయంలో పార్లమెంట్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ తదితర విషయాలను గురించి ఆర్డీవో అశోక చక్రవర్తి వివరించారు. అన్ని పార్టీలు ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక తహసీల్దార్ భాస్కర్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రాజు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ ప్రతినిధులు తాహెర్‌అలీ, పరమేష్, నగేష్, సాయిరాం, మోహీద్‌పటేల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మొల్లమాంబ జయంతి



మెదక్‌లో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న కుమ్మర ఉద్యోగుల సంఘం నాయకులు

మెదక్ అర్బన్, మార్చి 13: మొదటి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతిని బుధవారం మెదక్‌లో కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి పుష్పాంజలి సమర్పించారు. ఆ సంఘం అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. స్వయంగా చదువు నేర్చుకొని కవిత్వం రాసి సాహిత్య చరిత్రలో నిలిచిపోయిన కవయిత్రి మొల్లమాంబ అని కొనియాడారు. ప్రభుత్వం మెదక్‌లో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కుమ్మరి సంఘానికి స్థలాన్ని కేటాయించాలన్నారు. చేతి వృత్తిలో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు నిరుద్యోగులకు బ్యాంకు నుంచి రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి రాములు, కోశాధికారి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు అనురాధ, అనిత, మానస పాల్గొన్నారు.

**తూప్రాన్‌లో..**

తూప్రాన్: తూప్రాన్ పట్టణంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. మొల్లమాంబ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ, తూప్రాన్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు కుమ్మరి ప్రియాంక, శ్రీశైలంగౌడ్, రవీందర్‌రెడ్డి, పల్లెర్ల రవీందర్‌గుప్తా, నర్సోజీ, మామిండ్ల కృష్ణ, కుమ్మరి సంఘం నాయకులు రఘుపతి, రాములు, జయరాములు, మండలాధ్యక్షుడు యాదగిరి, నర్సింహులు, మహేశ్, వెంకట్, కృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యోగిపై చర్యలు తీసుకోండి

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 13: సిర్గాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న నారాయణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్లే ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నాడని, ఇవ్వకుంటే పని జరగదంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. స్థానికుడైన నారాయణ ఆరు సంవత్సరాలుగా ఇక్కడే విధులు నిర్వహిస్తూ కార్యాలయంలో అన్ని తానై వ్యవహరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఇంటిలోనే కార్యాలయ కంప్యూటర్లు పెట్టుకుని డబ్బులు తీసుకుని పాత రికార్డులు ఇస్తున్నాడని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ

గుమ్మడిదల/చేగుంట, మార్చి 13: గుమ్మడిదల మండలంలోని గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం, కానుకుంట, అనంతారం, నల్లవల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగరావు బుధవారం పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, ఎంపీటీసీలు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నాయకులు మద్ది ప్రతాప్‌రెడ్డి, తులసీదాస్, జయశంకర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, అంజనేయులు, బాలకృష్ణగౌడ్, మేకల యాదగిరి, నాగేష్, పోతురాజు సుధాకర్ పాల్గొన్నారు. చేగుంట ఆదర్శ పాఠశాలలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పాఠశాలకు క్రీడా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జి కమల్ కిషోర్, ఉపాధ్యాయులు గౌస్మొయినుద్దీన్, వెంకటేష్, ఏఎస్‌వో చరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులకు సన్మానం



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ రమేష్, ఏఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, మార్చి 13: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ రమేష్ హాజరై మాట్లాడారు. అనేక రంగాల్లో మహిళలు తమ శక్తిని నిరూపిస్తున్నారని, జిల్లాలో మహిళ ఉద్యోగినుల పని తీరు ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభను కనబరిచిన మహిళా ఉద్యోగినులను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, జిల్లా అధికారులు బ్రహ్మాజీ, విజయలక్ష్మి, కరుణ, ఇందిర, మాధురి, సుధా, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ**

సంగారెడ్డి రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 23, 24 తేదీల్లో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో మహిళా, దివ్యాంగుల రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అడివయ్య తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ ఆవిష్కరించారు.

## గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

నర్సాపూర్/నాగల్‌గిద్ద/మునిపల్లి, మార్చి 13: నర్సాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు బుధవారం ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, నాయకులు సందీప్, రామాగౌడ్, అజ్మత్, శివకుమార్, మహేష్, రమేష్, ఎల్లేష్ పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఔదత్‌పూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు అంబాజీ, సంతోష్, హనుమంతులు ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు నర్సింగ్‌పటేల్, నాయకులు వైపందరి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రమైన మునిపల్లిలో రూ.15లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ విజయసుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు సుధాకర్‌రెడ్డి, యాదయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజుపాటిల్, నాయకులు వీరన్నపటేల్, రేగోటి సరేష్, ఎల్లాగౌడ్, శివన్న పంతులు, సిద్దన్న, బోయిని శ్రీను, ప్రవీణ్, జగదీశ్, గోపాల్, బస్వరాజ్, ప్రకాశ్, రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

చిన్నశంకరంపేట/మాసాయిపేట, మార్చి 13: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. మాసాయిపేట మండల కేంద్రం, చిన్నశంకరంపేట మండలంలోని సూరారంలో బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో



మాసాయిపేటలో హాల్‌టికెట్‌ను అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

ఆయన పాల్గొని, విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఉత్తీర్ణతలో జిల్లా మొదటి స్థానంలో నిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాసాయిపేటలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ముంతజలి, ఉపాధ్యాయులు రంగారెడ్డి, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, సమంత, ఉప సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.సూరారంలో హెచ్ఎం సాయిరెడ్డి, తూప్రాన్ మండల నోడల్ ఆఫీసర్ పార్వతి, జిల్లా క్రీడల సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్, మాజీ సర్పంచ్ నీరజా పవన్‌గౌడ్, ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వినోద్, కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

**వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి**

మునిపల్లి: పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కంకోల్ జడ్పీ హెచ్ఎస్‌లో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో దశరథ్, పాఠశాల హెచ్ఎం తుకారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.